# వరంగల్ వాయిస్

*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 193
పేజీలు : 08 | వెల: రూ.5/-

బుధవారం
ఏప్రిల్ 30, 2025

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## నూతన జంటను ఆశీర్వదించిన జర్నలిస్టులు



8లో..

# కనుమరుగవుతున్న.. కార్మిక చట్టాలు



వివరాలు2లో..

మేడే అనగానే గుర్తుకు వచ్చేది కార్మిక వర్గమే. ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో వారిదే కీలక భూమిక. వారు లేనిదే జీవనం ముందుకు సాగదన్నవిషయం అందరికీ తెలుసు.. అయినప్పటికీ ప్రతి ఏటా మే 1న కార్మికులంతా కలిసి జెండాలు ఎగరేయడం.. సెలవు దినంగా పాటించడం తప్ప వారి జీవితాల్లో వెలుగులు కనిపించడం లేదు. వారిని నేటికీ బానిసలుగానే చూస్తున్న తీరు దారుణం. కార్మిక వర్గాన్ని అక్కున చేర్చుకోవాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. చట్టాలు పరిశ్రమల యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్నాయి. కనీస వేతనాలు అమలు కావడం లేదు. పనిదినాలు, పని గంటలు అన్నవి లేకుండా పోతున్నాయి. దేశంలో కార్మికులను అణచివేసే రాక్షస యాజమాన్యాలకే ప్రభుత్వాలు అండగా ఉంటున్నాయి. వారికి ప్రభుత్వాలు వత్తాసు పలుకుతున్న కారణంగా కార్మిక సంక్షేమం అన్నది మేడిపండు చందంగా మారింది. కార్మికుల పోరాటాల్లో నుంచి మేడే పుట్టినా...నిత్యం వారికే అన్యాయం జరుగుతోంది. వారినే యాజమాన్యాలు చులకన చేస్తున్నాయి. ముఖ్యంగా కార్పొరేట్ రంగం విస్తరించిన తరవాత కార్మికుల జీవితాలకు, జీతాలకు విలువ లేకుండా పోయింది. ప్రధానంగా పనిదినాలు, పనిగంటలు అన్నవి మృగ్యం అయ్యాయి. నిబంధనల మేరకు అనే పద్ధతి పోయింది. కంపెనీల నిబంధనల మేరకు పనిచేయాల్సి వస్తోంది.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

- అమలుకాని పని దినాలు, పని గంటలు
- విలువలు లేని కార్మికుల జీవితాలు, జీతాలు
- యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్న చట్టాలు
- వారికే వత్తాసు పలుకుతున్న ప్రభుత్వాలు
- 'మే'డే సందర్భంగా ప్రత్యేక కథనం



2లో..

## భద్రకాళిలో ధ్వజారోహణం

- ప్రారంభమైన కల్యాణ బ్రహ్మోత్సవాలు



8లో..

## పుష్కరాల పనులు పూర్తి చేయండి

- ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



2లో..

## నిజాయితీగా పనిచేయాలి.. పోలీసుల గౌరవం పెంచాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



8లో..

## పేదల పక్షాన నిలుస్తాం.. మెరుగైన పాలన అందిస్తాం

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

# కనుమరుగవుతున్న.. కార్మిక చట్టాలు



- అమలుకాని పని దినాలు, పని గంటలు
- విలువలు లేని కార్మికుల జీవితాలు, జీతాలు
- యాజమాన్యాలకు చుట్టాలుగా మారుతున్న చట్టాలు
- వారికే వత్తాసు పలుకుతున్న ప్రభుత్వాలు
- 'మే'డే సందర్భంగా ప్రత్యేక కథనం

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** భారత్‌లో మొదటిసారిగా 1923 మే 1వ తేదీన కార్మిక దినోత్సవాన్ని జరుపుకోవడం జరిగింది. మనదేశంలో ఇతర దేశాల కంటే ముందే కలకత్తాలో కార్మికుల పనిగంటల కోసం హౌరా రైల్వే స్టేషన్ లో 1862లోనే సమ్మె చేశారు. 1923లో తొలిసారిగా భారత్ దేశంలో మే డే ను పాటించారు. ఆ తర్వాత ట్రేడ్ యూనియన్ ఏర్పడడంతో అప్పటి నుంచి కార్మికవర్గాల్లో చైతన్యం మొదలైంది. దీంతో ప్రతి ఏడు కార్మిక లోకం మే డే సందర్భంగా పెద్ద ఎత్తున జెండాలు ఎగురవేయడంతోపాటు ఆరోజు సెలవు దినంగా పాటిస్తున్నాయి. కానీ అసంఘటిత కార్మిక వర్గం అన్ని రంగాల్లో వచ్చింది. 1985 తర్వాత చోటుచేసుకున్న ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్, గ్లోబలైజేషన్ (ఎల్పీజీ) పరిణామాల వల్ల అసంఘటిత కార్మిక వర్గాల కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడంలేదు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ఐరోపా దేశాల్లో మే 1వ తేదీని సెలవు దినంగా పాటించడం మొదలుపెట్టారు. అనంతరం అనేక దేశాలు ఇదే బాటలో నడిచాయి. చాలా దేశాల్లో కార్మికులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలు ఆ రోజునే అమల్లోకి వచ్చాయి.

### ఇంకా బానిసలుగానే..

ఏటా మేడేలు జరుపుకుంటున్నా స్వేదం చిందిస్తున్న కార్మికులను ఇంకా బానిసలుగా చూస్తున్న ఘటనలు కోకొల్లలు.

మేడేలు జరుపుకుంటున్నా వారిని ఆదరించే తీరులో మాత్రం చిత్తశుద్ధి కానరావడం లేదు. కార్మికులకోసం అనేక చట్టాలు ఉన్నా అమలుకు నోచుకోవడం లేదు. ఫిర్యాదులు చేసినా పట్టించుకునేవారే లేరు. ఇకపోతే శ్వేదం చిందిస్తూ మిద్దెలు, మేడెలు కడుతున్నా.. వారికి కనీసం గూడు ఉండడం లేదు. వారి పిల్లలకు చదువూసంధ్యా దక్కడం లేదు. వ్యవసాయం మొదలుకొని అన్నిరంగాల్లో కార్మికుల చెమట లేకుండా ఏ పనీ జరగడం లేదు. సర్వసంపదలు సృష్టించే శ్రామికవర్గం అన్నది గుర్తింపు లేకుండా పోయింది. కార్మికులు తమ స్వేదాన్ని రక్తంగా చిందించి లాభాలు తెచ్చి పెడుతున్నా, నేటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదు.

### పోరాటాల ఫలితం..

ఎన్నో పోరాటాల ద్వారా కార్మిక హక్కులు సాధించుకున్నా.. నేటికీ అవి అమలు కావడం లేదు. ఎనిమిది గంటల పని హక్కు కోసం ఆనాటి ప్రభుత్వాల మెడలు వంచారు. తమ హక్కుల సాధన కోసం వందలాది మంది ప్రాణాలు అర్పించారు. పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదు. తమ డిమాండ్లపై నినదించిన వారిని తక్షణం ఉద్యోగాల నుంచి తొలగస్తున్నారు. ఉద్యోగాలు తొలగించినా.. నోటీసులు ఇవ్వకున్నా కార్మిక సంక్షేమ శాఖ చూసీచూడనట్లుగా ఉంటోంది. తమపై అధికారులనుంచి మహిళలకు వేధింపులు తప్పడంలేదు. ఇది చాలా తీవ్రమైన విషయం దీనిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అలాగే కార్మికుల పిల్లలకు విద్యా, ఉద్యోగ సౌకర్యాల కల్పన లేదు. వారి ఆరోగ్య సమస్యలపై పెద్దగా స్పందించడం లేదు. అలాగే అర్ధాంతరంగా కంపెనీలను, సంస్థలను మూసివేసి కార్మికలు నోట్లో మట్టికొడుతున్నా కార్మిక చట్టాలు పనిచేయడం లేదు. నేటికీ ఇంకా ఫ్యూడల్ భావాల నుంచి యాజమాన్యాలు బయటపడడం లేదు.

### అణచివేతే లక్ష్యంగా..

మారిన ప్రపంచ పటంలో మారుతున్న కాలంలో ఇంకా కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. కార్మికులను అణచివేసేందుకు యాజమాన్యాలు కొత్తకొత్త పద్ధతులను అనుసరిస్తున్నాయి. యాజమాన్యాలకు వత్తాసు పలికే బూర్జువా విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి. అప్పుడే మేడేకు సార్థకత చేకూరుతుంది. పారిశ్రామికీకరణ తరవాత కూడా మార్పులు రావడం లేదు. కార్మికులకు హక్కులు లేకుండా చేస్తున్న యాజామాన్యాలకు అనుగుణంగా చట్టాలు తీసుకుని రావడం దారుణం. ఈ పరిస్థితులనుంచి బయటపడాలి. పక్కాగా శ్రామిక చట్టాలు అమలు చేసి వారికి అండగా నిలవాలి. కార్మిక హక్కులు, పోరాటాలు, త్యాగంతోనే సాధ్యం అయ్యాయి. కానీ ప్రభుత్వాలు కార్పోరేట్ కంపెనీల మోచేతి నీళ్లు తాగుతూ..కార్మికులకు ద్రోహం చేస్తున్నాయి. ఇవాళ మనం చూస్తున్న ఈ ప్రపంచం, అభివృద్ధి అంతా కూడా కార్మికుల శ్వేదం చిందిస్తేనే సాధ్యం అయ్యిందన్న విషయం మరచిపోతున్నాం. కార్మికవర్గం లేకుంటే తమకు పురోగతి లేదన్న భావనలో లేరు.

### తిరుగుబాటు..

పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో కార్మికులను బానిసల వలే పని చేయించారు. కార్మికులు రోజుకు 16 నుంచి 20 గంటల వరకు పని చేసేవారు. అయితే చైతన్యం పెరగడంతో మెల్లగా 19వ శతాబ్దం ప్రారంభం నుంచి కార్మికులు తిరుగుబాట్లు ప్రారంభించారు. ఆనాడు కార్మికులకు ఎటువంటి భద్రత గాని, సౌకర్యాలు గాని ఉండేవి కాదు. ఫ్యాక్టరీల్లో గాలి, వెలుతురు సౌకర్యాలు మృగ్యం. కార్మికులకు యంత్రాల నుంచి రక్షణ లేదు. తరచుగా ప్రమాదాలకు గురై మరణించే వారు. కార్మికులు అమానుష శిక్షలకు గురవుతుండేవారు. కార్మికులు తమ పీడనకు వ్యతిరేకంగా యంత్రాలను ధ్వంసం చేసేవారు. ఈ విధ్వంసకాండ బ్రిటన్‌లో ప్రారంభమైంది. యంత్రాలను విచ్ఛిన్నం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ బ్రిటన్‌లో చట్టం చేసారు. ఈ దుస్థితి నుంచి బయట పడడానికి పోరాటం సల్పడం ఒక్కటే మార్గమని కార్మికవర్గం అర్థం చేసుకుంది. కార్మిక వర్గం చైతన్యవంతంగా ఉన్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభమైంది. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియా కార్మికులు సమ్మె చేశారు. ఫిలడెల్ఫియా నగరంలో 'మెకానిక్స్ యూనియన్' పేరుతో కార్మిక సంఘాన్ని స్థాపించారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు సంఘాలను నిర్మించుకొని పోరాటాలు సాగించారు. ట్రేడ్ యూనియన్ల మహత్తర శక్తిని చూసి పాలకులు హడలెత్తిపోయారు. 1886 చికాగో కార్మికుల పోరాటం, 1884 అక్టోబర్‌లో అమెరికా, కెనడాల ఆర్గనైజ్డ్ ట్రేడ్ అండ్ లేబర్ యూనియన్ల నాలుగవ మహాసభ జరిగింది. 1886 మే నుంచి 8 గంటల పని చట్టబద్ధమైన పనిదినంగా ఉంటుందని తీర్మానం చేసింది. మే 1వ తేదీన సమ్మె చేయాలని కార్మిక వర్గానికి పిలుపు నిచ్చింది. 'మనిషి జీవితంలో రోజులో 8 గంటల పని, 8 గంటల విశ్రాంతి, 8 గంటల దినచర్య' అనే శాస్త్రీయ పద్ధతి కోసం పోరాడాలని నిర్ణయించారు. ఈ పిలుపుకు అశేషమైన స్పందన వచ్చింది. వేలాది మంది కార్మికులు అనేక సంస్థలు '8 గంటల పని దినం' కోసం మే 1వ తేదీన సమ్మెలో పాల్గొన్నారు. 1889లో ప్యారిస్‌లో జరిగిన సోషలిస్టు ఇంటర్నేషనల్ మొదటి కాంగ్రెస్ మేడేను అంతర్జాతీయ కార్మికదినంగా అమలు చేయాలన్న తీర్మాణం రూపొందించింది. అప్పటి నుంచి మేడేను అధికారికంగా కార్మికలోకం జరుపుకుంటోంది. ఆ తరవాత జరిగిన పరిణామాల నేపథ్యంలో కార్మికవర్గ కార్యక్రమాలు బాగా పెరిగాయి. ఈ అనుభవాను గుర్తించినా రానురాను ఈ ఆధునిక యుగంలో కార్పోరేట్ కంపెనీలన్నీ ప్రభుత్వాలతో కుమ్మక్కయి కార్మికులను అణచి వేస్తున్నాయి. ఈ క్రమంలో మరో కార్మికోద్యమానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. ప్రభుత్వాలు మేల్కొని అప్రమత్తంగా ఉండకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు.

## భద్రకాళిలో ధ్వజారోహణం

- ప్రారంభమైన కల్యాణ బ్రహ్మోత్సవాలు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయంలో బుధవారం అంగరంగ వైభవంగా శ్రీ భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమాల్లో భాగంగా ధ్వజారోహనం నిర్వహించారు. ఉదయం అమ్మవారిని మహేశ్వరిగా అలంకరించి వృషభ వాహనంమీద, సాయంకాలం మృగవాహినిగా అలంకరించి ఊరేగింపు జరిపారు. నాలుగు పాదాలు కలిగిన వృషభాన్ని ధర్మస్వరూపంగా భావిస్తారు. ఈ సమయంలో అమ్మవారి దర్శనంతో సాధకుడికి చంచలత్వం పోయి స్థిరమైన బుద్ధి కలిగి సాధన సక్రమంగా కొనసాగుతుందని, కన్యలకు వివాహమై మంచి భర్త దొరుకుతాడని ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. ఈ రోజు కార్యక్రమాలకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ వారు ఉభయదాతలుగా వ్యవహరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి నుంచి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి పురోహిత సంఘం అధ్యక్షుడు రుద్ర పాండురంగ శాస్త్రి, రుద్ర శ్రీశైలం, చెన్న కేశవులు అమ్మవారి కల్యాణం నిమిత్తం ప్రత్యేకంగా నేచిన పట్టు చీరను సమర్పించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించనున్న శ్రీ భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణంలో పాల్గొనువారు ముందుగా దేవస్థానంలో రూ.516 చెల్లించి రశీదు పొందాలని కార్యనిర్వహణాధికారి శేషు భారతి సూచించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రములు, ప్రసాదాలను అందజేయనున్నట్లు తెలిపారు.

## నిజాయితీగా పనిచేయాలి.. పోలీసుల గౌరవం పెంచాలి

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీసుల గౌరవ, మర్యాదలు పెంపోందించేలా ప్రతి ఒక్కరూ నిజాయితీగా పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. బుధవారం తొలిసారి మడికొండ పోలీస్ స్టేషన్ ను సీపీ సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలతోపాటు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కంట్రోల్ రూంలోని ఆయన పరిశీలించి సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు, స్టేషన్ పనీతీరుతో పాటు ,స్టేషన్ పరిధిలో ఏలాంటి నేరాలు జరుగుతాయి, ఎంత మంది రౌడీ షీటర్లు ఉన్నారు, రోజు జరిగే ప్రమాదాల సంఖ్య, పోలీస్ స్టేషన్ పరిధి, స్టేషన్ సిబ్బంది మొదలైన వివరాలను ఇన్ స్పెక్టర్ పుల్యాల కిషన్ ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పోలీసుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా నిజాయితీగా పనిచేయాలని, ఫిర్యాదులుపై వేగంగా స్పందించాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్ పరిధిలో హనుమకొండ హైదరాబాద్ ప్రధాన రోడ్డు మార్గం ఉండటం ద్వారా ఈ మార్గంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, నేరాల నియంత్రణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట కాజీపేట ఏసీపీ తిరుమల్, ఎస్సై రాజ్ కుమార్, మడికొండ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



### కాజీపేట పోలీస్ స్టేషన్ సందర్శన..

అనంతరం కాజీపేట పోలీస్ స్టేషన్ ను సీపీ సందర్శించారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను స్టేషన్ ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నేరాలపై ఆరా తీశారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరు, వారు నిర్వహించే విధుల సమయాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ వెంట కాజీపేట్ ఏసీపీ తిరుమల్, ఇన్ స్పెక్టర్ సుధాకర్ రెడ్డి, ఎస్సైలు నవీన్, శివకృష్ణ, లవణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# 2025-నీట్ పరీక్ష కేంద్రాల పరిశీలన

**వరంగల్ వాయిస్, జనగామ :** మే 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్-2025 కు జిల్లాలో ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలను డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ బుధవారం సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని గీతా నగర్ లో గల ఏబీవీ డిగ్రీ కళాశాల, అలాగే పెంబర్తిలోని ఎంజేపీటీ బీసీ డబ్ల్యూఆర్ఐఎస్ రెసిడెన్షియల్ విద్యా సంస్థలో నీట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ నేపథ్యంలో తరగతి గదులను తనిఖీ చేసి, నిఘా నేత్రాల (సీసీ కెమెరాలు) పనితీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా తరగతి గదుల్లో బెంచీలు, లైటింగ్, ఫ్యాన్లు, తాగునీరు, మూత్రశాలలు, తదితరాల వంటి మౌలిక వసతులను సమకూర్చాలని సూచించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. తరగతి గదులను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదుల్లో ఎక్కడా కూడా ఎటువంటి కాగితం ఉండటానికి వీల్లేదని ఆదేశించారు. అదే విధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతను అమలు చేయాలని, ప్రతి అభ్యర్థిని నిశితంగా పరిశీలించాకే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు.



## అభ్యర్థులకు కలెక్టర్ కీలక సూచనలు..

పరీక్ష రోజున (మే 4) ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 1:30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్ లను మూసివేస్తారన్నారు. అభ్యర్థులు హాండ్ కర్చీఫ్, మొబైల్ ఫోన్లు, వాచ్, బెల్ట్, పెన్, పెన్సిల్, రబ్బర్, శార్పనర్, ఎలక్ట్రానిక్ పరికరాలను కేంద్రంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. అలాగే పరీక్ష అడ్మిట్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని, దానిపై గల పరీక్ష కేంద్రం వివరాలను సరైన విధంగా సరి చూసుకోవాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ పర్యవేక్షణలో కలెక్టర్ వెంట ఆర్డీఓ గోపీరాం, జీసీడీఓ గౌసియా బేగం, చీఫ్ సూపరింటెండెంట్ లు రవీంద్ర నాయక్, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధికి అధికారులు, ప్రజలు సహకరించాలి

■ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజక వర్గ ఇంచార్జి ఝాన్సీ రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు:** ఎన్నో సంవత్సరాలుగా తొర్రూరు పట్టణ ప్రజలు ఆశించిన పెద్ద చెరువు కట్ట అభివృద్ధి కల ఈరోజు సాకారమైంది. ప్రజల ఈ దీర్ఘకాల కోరికను నెరవేర్చడానికి పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి ముందుకొచ్చారు. బుధవారం తొర్రూరు పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద చెరువు కట్ట నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకర్గ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. తొర్రూరు మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి పనులకు శుభారంభం చేశారు. తరువాత, జేసీబీ యంత్రం ఎక్కి స్వయంగా స్టీరింగ్ తిప్పి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు పట్టణానికి ఇది ఒక చారిత్రక రోజు. మా ప్రజల దీర్ఘకాల వాంఛను నెరవేర్చడం నా వ్యక్తిగత గర్వంగా భావిస్తున్నాను. ఈ చెరువు కట్ట నిర్మాణం పూర్తి అయితే పట్టణానికి వరదల సమస్య తొలగిపోవడమే కాక, భూగర్భ జలాల స్థాయి పెరగడం, పర్యావరణం రక్షించబడడం, అలాగే అందమైన సుందర ప్రాంతంగా మారడం జరుగుతుంది. మా ప్రభుత్వం ప్రజల అభ్యున్నతిని ప్రధాన లక్ష్యంగా తీసుకొని ముందుకు సాగుతోంది. ప్రతి సమస్యపై దృష్టి పెట్టి, అభివృద్ధి పనులు నిబద్ధతతో కొనసాగిస్తున్నాం. తొర్రూరు పట్టణ అభివృద్ధిలో ఇది ఒక ముఖ్యమైన మైలురాయి అవుతుంది. మీ అందరి మద్దతుతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. అంతేకాక, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకి తమ కృతజ్ఞతలు తెలిపారు. చెరువు కట్ట నిర్మాణం పూర్తయ్యాక తొర్రూరు పట్టణం అందానికి కొత్త ఒరవడి చేరనుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సూంచు సంతోష్, టౌన్ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, నాయకులు విజయ్ పాల్ రెడ్డి, మంగాలపెల్లి రాం చంద్రయ్య, జినుగ సురేందర్ రెడ్డి, గుండాల నర్సయ్య, పెదగని సోమయ్య, బిజ్జాల అనిల్, ధరావత్ సోమన్న, మహిళ నాయకులు, పట్టణ ప్రజలు, తదితరులు, ఉన్నారు.

# ఘనంగా బసవేశ్వరుడి జయంతి వేడుకలు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బసవేశ్వరుడు కేవలం మతపరుడే కాదు, సామాజిక దార్శనికుడు, మానవతావాది అని వేయి స్తంభాల దేవాలయ ప్రధాన అర్చకులు, తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షులు గంగు ఉపేంద్ర శర్మ తెలిపారు. 12వ శతాబ్దంలోనే కుల, మత, వర్ణ, వర్గ భేదాలను ఎదుర్కొంటూ సమానత్వాన్ని ప్రతిపాదించిన మహనీయుడు బసవన్న అని ఆయన చెప్పారు. బసవేశ్వరుని జయంతిని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్రను ఉపేంద్ర శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "బసవన్న సామాజిక సమానత్వం కోరినవాడు. తన జీవనం ద్వారా కొత్త ధర్మాన్ని స్థాపించి సమాజానికి మార్గదర్శకుడయ్యాడు," అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన బీసీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ బసవన్న లింగాయత ధర్మ స్థాపకుడు మాత్రమే కాక, ప్రజలకు మానవతా సందేశాన్ని ఇచ్చిన సంఘసేవకుడని కొనియాడారు. "ప్రభుత్వం బసవ జయంతిని అధికారికంగా జరుపుతుండటంతో, మేము కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాం. వీరశైవ లింగాయతులకు అన్ని విధాలా మద్దతు ఇవ్వడానికి మేము సిద్ధంగా ఉన్నాం," అని తెలిపారు. సంఘం అధ్యక్షులు శెట్టి పట్నం శెట్టి వీర సోమయ్య మాట్లాడుతూ, బసవేశ్వరుడు బాల్య వివాహాలు, సతీసహగమనాన్ని వ్యతిరేకించి, సమాజంలో ఆధునిక




భావజాలాన్ని నాటిన గొప్ప సంస్కర్త అని అన్నారు. జయంతి ఉత్సవ సమన్వయకర్త గుండవరం విధు మౌళి మాట్లాడుతూ, "బసవన్న ఆలోచనలు అన్ని కాలాలకు వర్తించేలా ఉన్నాయి. 12వ శతాబ్దంలోనే అనుభవమంటపం ద్వారా ప్రజాస్వామ్య పద్ధతిలో చర్చల నిర్వహణ చేపట్టి అందరికీ సమాన అవకాశాలను కల్పించారు," అని తెలిపారు. ఈ సందర్భంగా రఘువరన్ డప్పు బృందం వినిపించిన వాద్య విన్యాసాలు, బసవన్నపై జానపద శైలిలో పాడిన పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో శైలేష్ ప్రసాద్, పట్నం శెట్టి ఈశ్వరయ్య, దుర్గం సమ్మయ్య, నానం రాజయ్య, పెనాల సమ్మయ్య, గౌరీశంకర్, మఠం సురేష్, సూరం సురేష్ బాబు, సర్వేశ్వరరావు, ఉప్పు భాస్కర్, రాంశెట్టి రమేష్, ప్రభాకర్, బతిలా పరమేశ్వర్, బాణాల శ్రీ, గౌరీ సాయం, ఉష, రూప, శోభ, రజిత, సుమతి, సువర్ణ, అర్చకులు కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

# పాఠశాల విద్యార్థులకు సమ్మర్ క్యాంపు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మే ఒకటి నుంచి 15 వరకు మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి కె.హనుమంత రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సమ్మర్ క్యాంపులలో విద్యార్థులకు ఇండోర్ గేమ్స్, డాన్స్, యోగా, డ్రాయింగ్ మొదలైన అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం మండల పరిధిలోని 6వ నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులందరూ సమ్మర్ క్యాంపుకు హాజరయ్యే విధంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు.

# బసవేశ్వర చూపిన మార్గంలో నడవాలి




**వరంగల్ వాయిస్, జనగామ :** సమాజంపై అవగాహన కల్పించిన మొదటి గురువు శ్రీ బసవేశ్వర అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సామాజిక తత్వవేత్త, సంఘ సంస్కర్త మహాత్మా శ్రీ బసవేశ్వర 892వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మహాత్మా శ్రీ బసవేశ్వర చిత్రపటానికి కలెక్టర్ పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో ఉన్న అనేక మూఢాచారాలను పారద్రోలి కుల, మత, వర్ణ రహిత నవ సమాజాన్ని నిర్మించడానికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ అధికారి రవీందర్, డీఎస్సీడీఓ విక్రమ్, వీరశైవ లింగాయత్ కమ్యూనిటీ జిల్లా అధ్యక్షులు పక్కెర సిద్ధయ్య, కమ్యూనిటీ సభ్యులు, ఇతర సంబంధిత అధికారులు, హెచ్ డబ్ల్యూఓలు, కలెక్టరేట్, సంబంధిత కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# హరగోపాల్ శర్మకు "శాంతిమిత్ర" అవార్డు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక షిరిడి సాయిబాబా మందిరానికి గత నాలుగు దశాబ్దాలుగా ఆధ్యాత్మిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో విశేష సేవలందిస్తున్న చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ శర్మను వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ సంస్థ మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో "శాంతిమిత్ర" అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిరాజుద్దీన్, సురేష్ లాల్, శ్రీనివాస్, సరళ, మంజుల, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు. హరగోపాల్ శర్మకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో సాయిబాబా మందిర ధర్మకర్తలు రాకం సదానందం, వెయ్యిగండ్ల రమేష్, నిమ్మల శ్రీనివాస్, పూస సురేష్ కుమార్, మందిర సిబ్బంది ఉన్నారు.

# డోర్నకల్‌లో వృద్ధుడి అదృశ్యం



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** పట్టణంలోని సిగ్నల్ తండాకు చెందిన మూడ్ హరియా (వయస్సు 73) అనే వృద్ధుడు గత వారం రోజులుగా కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం, హరియా ఈ నెల 26న "హాస్పిటల్‌కు వెళ్తున్నాను" అంటూ ఇంటి నుంచి బయలుదేరి వెళ్లినప్పటి నుంచి ఇప్పటివరకు తిరిగి రాలేదు. వారు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీనిపై వారు ఈ నెల 27న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. హరియా ఆచూకి తెలిసిన వారు లేదా ఆయనను ఎక్కడైనా గమనించిన వారు 91778 65715, 95503 69834 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# కర్రెగుట్టల్లో కేంద్ర బలగాలను వెనక్కి రప్పించాలి

## ములుగులో ప్రజాసంఘాల భారీ ర్యాలీ



**వరంగల్ వాయిస్, ములుగు :** కర్రెగుట్టల్లో మోహరించిన కేంద్ర ప్రభుత్వ పోలీసు బలగాలను వెనక్కి రప్పించి శాంతియుత వాతావరణం కల్పించాలని ప్రజాసంఘాల జేఏసీ ములుగు జిల్లా చైర్మన్ ముంజాల భిక్షపతి గౌడ్ హనుమకొండ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆపరేషన్ కగార్ కు వ్యతిరేకంగా దళిత, గిరిజన, ఆదివాసి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారీ ఎత్తున వేలాది మందితో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన ఖనిజ సంపదను, సహజ వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టడం కోసమే ఆపరేషన్ కాగలరు కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని వారు విమర్శించారు. తక్షణమే ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు సోమ రామ్మూర్తి, సాయిని నరేందర్, వట్టం ఉపేందర్, బొట్ల భిక్షపతి, జై సింగ్ రాథోడ్, తెలంగాణ కొమురయ్య, కర్ణాటకపు వావిలాల లక్ష్మణ్, మోరే ఐలయ్య, అమ్ముల అశోక్, మాదాసు జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ అంటే ఆదివాసీలను హత్య చేయడమే

## ఎమ్మార్పీస్ నాయకుడు కేదాసి మోహన్ మాదిగ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశ ప్రజల మధ్య కులమత బేధాలు సృష్టిస్తూ బహిరంగంగా దళిత, గిరిజనులను అణిచివేతకు గురిచేస్తూ మరోపక్క ఆపరేషన్ కగార్ పేరుతో అమాయకులైన ఆదివాసి ప్రజలను హత్యలు చేస్తుందని ఎమ్మార్పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ దళిత రత్న కేదాసి మోహన్ అన్నారు. బుధవారం హనుమకొండ లో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఆదివాసి ప్రజలను చంపేసి అక్కడి అడవులలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను వారికి అప్పగించేందుకే ఈ హత్యలు చేస్తుందని విమర్శించారు. అమిత్ షా పెట్టుకున్న టార్గెట్ ప్రకారం మార్చి 2026 నాటికి నక్సలిజం అంతం చేసి ఈ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ఇలా చేయడం అనేది దుర్మార్గమైన చర్య అని ఖండించారు. ఇప్పటికైనా దేశ ప్రజల విజ్ఞప్తుల మేరకు ఆపరేషన్ కగార్ ను నిలిపి వేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని మోహన్ కోరారు.

# ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డిపో మేనేజర్ రవిచంద్ర ప్రారంభించడం జరిగింది. అరుణ ఫర్టిలైజర్ యజమాని, శ్రీ కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, సంజయ్ మెడికల్ స్టోర్ సంజయ్, గంగా వాటర్ ప్లాంట్ యజమాని లక్ష్మణ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో సిబ్బంది, ప్రయాణికులు, తదితరులు పాల్గొన్నారు.

# మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

## ➡ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు నోటీసు అందజేత



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దేశవ్యాప్తంగా కార్మిక హక్కుల పరిరక్షణ కోసం మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినాని రవీందర్ రెడ్డికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఎం. సాగర్, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్ తదితరులు మాట్లాడారు. వారు మాట్లాడుతూ, గత 100 సంవత్సరాల్లో కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారు. అయితే, గత 10 సంవత్సరాలుగా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాసి, 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్ రూపంలో యాజమాన్యాల అభిమతానుసారంగా కొత్త చట్టాలు తీసుకువచ్చిందని ఆరోపించారు. ఈ చట్టాలు కార్మికులను బానిసత్వంలోకి నెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. పని గంటలు, ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్, భద్రత వంటి అంశాల్లో మౌలిక హక్కులను తొలగించారని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో కార్మిక వర్గం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ దేశ ఖనిజ సంపదను దారి దత్తం చేస్తున్న విధానాలను వారు ఖండించారు. ఈ కారణంగా జాతీయ కార్మిక సంఘాలు, అసోసియేషన్లు, ఫెడరేషన్లు మే 20న సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. వరంగల్ జిల్లాలోని చాంబర్ ఆఫ్ కామర్స్ పరిధిలోని అన్ని వ్యాపార, వాణిజ్య సంస్థలు మే 20న బంద్ పాటించాలని కోరుతూ ఈ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రెజరర్ ఆలే సంపత్, అడట్టి సెక్షన్ ప్రెసిడెంట్ లింగారెడ్డి, కాటన్ సెక్షన్ ప్రెసిడెంట్ చిరుతలపల్లి వీరారావు, ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, యాకోబు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖ శాంతులతో ఉండాలి

**వరంగల్ వాయిస్, తొర్రూరు:** రాయపర్తి మండలం కొత్తూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్టాత్మ మహోత్సవంలో పాల్గొని భక్తులతో కలిసి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనం ఎత్తి పాలకుర్తి నియోజకవర్గ శాసనసభ్యురాలు యశశ్విని రెడ్డి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ముదిరాజ్ సంఘం నాయకులు శాలువాలతో సన్మానించి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశశ్విని రెడ్డి మాట్లాడుతూ.. పెద్దమ్మ తల్లి దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని ప్రత్యేక మొక్కులు చెల్లించినట్లు ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్య నాయక్, మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి, బిళ్ల సుధీర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు కందికట్ల యాకయ్య, మండల ముఖ్య నాయకులు, ముదిరాజ్ సంఘం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.



# ఓంకార్ నేటి తరానికి ఆదర్శం : జస్టిస్ చంద్రకుమార్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో, శాసనసభలో ప్రజా సమస్యల పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకుడు కామ్రేడ్ ఓంకార్ అని, నేటి రాజకీయ నాయకులకు ఆయన జీవితం ఆదర్శమని రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ పేర్కొన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో ఓంకార్ శతజయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వార్షికోత్సవం లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు గాదె మల్లేష్, తుడుం అనిల్ కుమార్, పల్లె మురళి, ఎ.కిష్టయ్య, కర్ర దానయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, ఓంకార్ రాజకీయాలను ప్రజల సేవగా భావించి, అసెంబ్లీలో అనేక ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి, వాటిని గట్టిగా వినిపించిన నేత అన్నారు. అవసరమైతే వాయిదా తీర్మానాలు కూడా ప్రవేశపెట్టే సాహసం చేసిన నేతగా ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి మాట్లాడుతూ, కామ్రేడ్ ఓంకార్ అసెంబ్లీకి మాత్రమే పరిమితం కాకుండా భూమి, భుక్తి, విద్య, వైద్యం, సామాజిక న్యాయానికి సంబంధించిన అంశాలపై ప్రజా పోరాటాలను కూడా నిర్మించారు అని తెలిపారు. పార్లమెంటు–పార్లమెంటేతర ఉద్యమాలు ఎలా నడపాలో స్వయంగా చేసి చూపించిన నేత అని చెప్పారు. ఈ మహోన్నత నాయకుడి శతజయంతి వార్షికోత్సవ ప్రారంభ సభ మే 12న వరంగల్ జిల్లా మచ్చాపూర్ వద్ద ఏర్పాటు చేయనున్నారు. అక్కడ ఓంకార్ సంస్మరణార్థంగా నిర్మించిన ఆసియా ఖండంలోనే అతి పెద్ద ప్రజా స్మారక స్తూపం వద్ద ఈ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కవులు, కళాకారులు, వామపక్ష నేతలు పెద్ద సంఖ్యలో హాజరవుతారని, ఈ సభను విజయవంతం చేయాలని గాదగోని రవి పిలుపునిచ్చారు. ఈ తరానికి ఓంకార్ ప్రజా పోరాట మార్గదర్శనం ప్రేరణగా నిలవాలని పలువురు స్పష్టంగా పేర్కొన్నారు.

# హిందీ స్టేట్ రిసోర్స్ పర్సన్ గా ఎంపికైన గౌస్ పాషాకు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న హిందీ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడానికి గాను హిందీ స్టేట్ రిసోర్స్ పర్సన్ గా రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల ఎంపిక చేసిన హనుమకొండ జిల్లాకు చెందిన హిందీ భాషోపాధ్యాయుడు ఎస్. కె గౌస్ పాషాను బుధవారం ప్రభుత్వ హిందీ టీచర్స్ ఫోరం పక్షాన ఆర్. లక్ష్మణ్ సుధాకర్, పండితారాధ్యుల అంబా ప్రసాద్, మేరుగు అనురాధలు సన్మానించారు. విద్యాశాఖ, ఎస్.సీ.ఈ.ఆర్.టీలు సంయుక్తంగా నిర్వహించిన ఇంటర్వ్యూ, డెమో క్లాసులో గౌస్ పాషా అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్టేట్ రిసోర్స్ పర్సన్ గా ఎంపికయ్యారు. హనుమకొండ జిల్లా హసన్ పర్తిలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గౌస్ పాషా 2012 డీఎస్సీలో హిందీ పండిట్ గా నియమితులయ్యారు. ఆయనకు హిందీ భాషా బోధనపై, హిందీ వ్యాకరణంపై, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తరగతుల నిర్వహణపై, యూట్యూబ్ తరగతుల నిర్వహణపై గట్టి పట్టు ఉంది. 2017 నుంచి జిల్లాలో హిందీ డీఆర్పీగా, ఆ తర్వాత ఎస్ఆర్జీగా పనిచేస్తున్నారు. ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు యూట్యూబ్ లెసన్స్ తయారుచేసి ఆయన ఉపాధ్యాయులకు, విద్యార్థినీ, విద్యార్థులకు హిందీ భాష బోధన, నేర్చుకోవడంలో ఉన్న ఇబ్బందులను తొలగించారు. హిందీ స్టేట్ రిసోర్స్ పర్సన్ గా ఎంపికైన గౌస్ పాషాను ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న హిందీ ఉపాధ్యాయులు, హిందీ భాషాభిమానులు అభినందించారు.

# డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు సకాలంలో నిర్వహించాలి

■ పీడీఎస్ యూ నేతల డిమాండ్




**వరంగల్ వాయిస్, కేయూ :** డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, సెమిస్టర్ పరీక్షలను సకాలంలో నిర్వహించాలని పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు కేఎన్ యూనివర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు మాట్లాడుతూ కేయూ పరిధిలో డిగ్రీ 2వ, 4వ, 6వ సెమిస్టర్ పరీక్షలు తరచూ వాయిదా వేయడంవల్ల విద్యార్థులు పీజీ, లాసెట్, బీఎడ్ వంటి ప్రవేశ పరీక్షలు రాసే అవకాశం కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా ఫైనల్ ఇయర్ విద్యార్థుల విద్యా సంవత్సరం వృథా కావడంతో పాటు, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్‌లను విడుదల చేయకపోవడం వల్ల ప్రైవేట్ కళాశాలలు ఆర్థికంగా నష్టపోయి సమ్మె బాట పడుతున్నాయని, ప్రభుత్వ స్పందన లేకపోవడంతో పరీక్షలు నిర్వహించలేమని విద్యాసంస్థల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయని వారు తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యార్థులే మధ్యలో నలిగిపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించి, పరీక్షలు వాయిదా పడకుండా సకాలంలో నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల హితాన్ని దృష్టిలో ఉంచుకొని మే మొదటి వారంలో డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తామని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ కాకతీయ యూనివర్సిటీ కార్యదర్శి వి.కావ్య, ఉపాధ్యక్షులు అనూష, గణేష్, సహాయ కార్యదర్శులు యాదగిరి, శ్రీజ, సాధన, యూనివర్సిటీ నాయకులు చారి, లోకేష్, వినయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# నత్తి కోర్నెల్‌కు దళిత రత్న అవార్డు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** బా బా సా హె బ్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14, 2025న ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో "దళిత రత్న" అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సామాజిక సేవలో కృషి చేసిన పలువురికి ఈ గౌరవం దక్కింది. వారిలో ఆత్మకూర్‌కు చెందిన నత్తి కోర్నెల్ కూడా ఒకరు. వారు గత కొంతకాలంగా దళితుల సంక్షేమం కోసం ప్రజా సంఘాల వేదికగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కృషిని గుర్తించిన అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ వర్కింగ్ ఛైర్మన్ ఇటుక రాజు ఆధ్వర్యంలోని కమిటీ వారి పేరును ప్రతిపాదించి, అవార్డును అందించారు. అవార్డు అందుకున్న అనంతరం నత్తి కోర్నెల్ మాట్లాడుతూ, "నా సేవలకు గుర్తింపుగా 'దళిత రత్న' అవార్డు ఇవ్వడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ నాగగారి ప్రీతంను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశానని తెలిపారు. అలాగే తనకు సహకరించిన పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మటి సాంబయ్య, ఎస్సీ డిపార్ట్మెంట్ కార్యదర్శి, స్టేట్ కన్వీనర్ గౌరవ దళితరత్న దబ్బేట రమేష్, మల్కాజ్ గిరి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ ఛైర్మన్ పత్తి కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# జర్నలిస్ట్ వెంకన్న కూతురు వివాహం

## హాజరైన ఆత్మకూరు జర్నలిస్ట్ కమిటీ సభ్యులు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** గోల్కొండ వెంకన్న కుమార్తె అశ్వినీ వివాహం బుధవారం మండలంలోని కామారం గ్రామంలో సాగర్‌తో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆత్మకూరు జర్నలిస్ట్ కమిటీ సభ్యులు వేడుకకు హాజరై నవ వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్ జర్నలిస్ట్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల విజేందర్, ప్రధాన కార్యదర్శి కందగట్ల రాము, గౌరవ సలహాదారు కొండబత్తుల వేణుగోపాల్, కోశాధికారి సముద్రాల సురేష్, సభ్యులు బూర సతీష్, వెల్లే లక్ష్మణ్, వర్షం మధు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా టాపర్‌గా డోర్నకల్



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** 2024-25 సంవత్సరానికి గను జరిగిన పదో తరగతి వార్షిక పరీక్షల్లో మహబూబాబాద్ జిల్లా (99.29 శాతం ఉతీర్ణత సాదించి) రాష్ర్టంలోనే ప్రథమ స్థానంగా నిలిచింది. ఇందులో డోర్నకల్ మండలం 99 శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా టాపర్ గా నిలిచింది. డోర్నకల్ మండలంలోని కన్నెగుండ్ల, చిలుకోడు,పెరుమాండ్ల సంకీసా, మోడల్, కస్తూర్బా పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా ముల్కలపల్లి-1, జడ్పీహెచ్ఎస్ డోర్నకల్-2 ఫెయిల్ అయ్యారు. ప్రైవేట్ పాఠశాల నుంచి సెయింట్ ఆగ్నెస్ పాఠశాల విద్యార్థిని 579 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలుగా, 572 మార్కులు సాధించి నిర్మల స్కూల్ విద్యార్థి రెండో స్థానం కైవసం చేసుకున్నారు. మొత్తానికి మండలం ఈ సారి 99 శాతం ఉత్తీర్ణత సాధించి నూతన రికార్డు నెలకొల్పింది.

# బాటసారులకు మజ్జిగ పంపిణీ



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** అధిక ఎండల, వేడి నేపథ్యంలో ప్రయాణికులకు ఆత్మకూరు మండల కేంద్రంలోని 163 జాతీయ రహదారిపై మహాలక్ష్మి ఎలక్ట్రికల్ ప్రొప్రైటర్ జితేందర్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో ప్రయాణికులు మజ్జిగ సేవించి దాహార్తిని తీసుకుంటున్నారు. ప్రయాణికులు, బాటసారులు ఎండలు తీవ్రంగా మండుతుందంతో రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్నారు. ప్రయాణికులను దాహార్తిని దృష్టిలో పెట్టుకొని ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తూ ఉండడంతో పలువురు జితేందర్ ను అభినందిస్తున్నారు.

# కొనుగోలు కేంద్రాల పరిశీలన



**వరంగల్ వాయిస్, నడికూడ :** తెలంగాణ రైతు రక్షణ సమితి, తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు నడికూడ మండలంలోని గ్రామాలలో యాసంగి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేసి సన్న వడ్లకు రూ.500 బోనస్ రైతుల అకౌంట్ లో వెయ్యాలని కోరారు. రైతులను కొనుగోలు కేంద్రాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, జిల్లా నాయకులు చోళ రామారావు మండల నాయకులు వంకే రాజు, టింకురాల రాజు సంతోష్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాకవి శ్రీ శ్రీ జయంతి




**వరంగల్ వాయిస్, జనగామ:** శ్రీశ్రీ కళావేదిక జనగామ జిల్లా కమిటీ అధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి వేడుకలు స్కాలర్ గ్రామర్ స్కూల్ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళావేదిక రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు లగిశెట్టి ప్రభాకర్ అధ్యక్షత వహించారు. సభలో పలువురు మాట్లాడుతూ శ్రమైక జీవనానికి ప్రతీకలు శ్రీశ్రీ కవిత్వం అన్నారు. శ్రీశ్రీ సృజించిన కవిత్వం సమసమాజ నిర్మాణానికి పునాదులు వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు కళాకారులు సాంబరాజు యాదగిరి, జి.కృష్ణ, పెట్లోజు సోమేశ్వరాచారి, నక్క సురేష్, చిలుమోజు సాయికిరణ్, రంగరాజు ప్రసాద్,గూటం రమేష్, గుండె కనకయ్య పాల్గొన్నారు.

# ఘనంగా ఉద్యోగ విరమణ



**వరంగల్ వాయిస్, మామనూర్ :** నాలుగో బెటాలియన్ లో బుధవారం సయ్యద్ అబ్బాస్ హుస్సేన్, బి.ఖీమా ఏఆర్ఎస్ఐలుగా విధులు నిర్వర్తించి నేడు ఉద్యోగ విరమణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కమాండెంట్ బి.రామ్ ప్రకాష్ హాజరై ఉద్యోగ విరమణ పొందుతున్న సయ్యద్ అబ్బాస్ హుస్సేన్, బి.ఖీమాకి శాలువా కప్పి సన్మానించారు. తమ సర్వీస్ లో ఎలాంటి రిమార్క్స్ లేకుండా విరమణ పొదుతున్నారని, ఉద్యోగ విరమణ తర్వాత తన కుటుంబంతో సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ క్రిష్ణ ప్రసాద్, వీరన్న, రిజర్వు ఇన్ స్పెక్టర్స్ రవి, రాజ్ కుమార్, అశోక్, కృష్ణ, అధికారులు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మండల టాపర్‌గా మంచోజుల వర్షిత్



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి మంచోజుల వర్షిత్ బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాలలో నడికూడ మండల టాపర్ గా నిలిచాడని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల విద్యాధికారి కె.హనుమంతరావు తెలిపారు. నర్సక్క పల్లి గ్రామానికి చెందిన వర్షిత్ నడికూడ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఫలితాలలో 600 మార్కులకు గాను 536 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి వర్షిత్ కు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ తాళ్లపల్లి స్రవంతి, ఉపాధ్యాయ బృందం దొంతుల శ్రీనివాస్, జయ, శివ చైతన్, సుమలత, శ్రవణ్ ,శ్రీనివాసరెడ్డి, తిరుపతి, శివకుమార్, సుభాని, జ్యోత్స్న, శారద అభినందనలు తెలిపారు.

# మే డే ను జయప్రదం చేయండి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే 1న ఊరూర వాడ వాడల అరుణ పతాకాలు ఎగురవేసి ఘనంగా నిర్వహించాలని, శ్రామిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడేందుకు ప్రతిన బూనాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. దోపిడీ వ్యవస్థను అంతం చేసి ఒక మనిషి మరొక మనిషిని దోపిడీ చేయుటకు వీలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడేందుకు మే దినోత్సవం సందర్భంగా సకల శ్రామిక జనావళి దీక్ష బూనాలని రామ రాజేష్ ఖన్నా విజ్ఞప్తి చేశారు.

# హనుమాన్ స్వాములకు అన్నదానం



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** న్యూ శాయంపేట పరిధిలోని శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ మాల ధారణ స్వాములకు 41 రోజులు నిత్య అన్నదానం నిర్వహిస్తున్న సందర్భంలో సుమారు 800 హనుమాన్ స్వాములకు 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మామిండ్ల రాజు మాట్లాడుతూ ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కుటీరం మేనేజ్ మెంట్ స్వాములందరికీ హనుమాన్ దీవెనలు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నానని వారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ భక్తాంజనేయ కుటీరం స్వాములు యాదగిరి,శ్యామ్, మధు, చిరంజీవి,యాదగిరి, బిక్షపతి స్వాములందరి తరుపున మామిండ్ల రాజుకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ



**వరంగల్ వాయిస్, వరంగల్:** నగరంలోని 31వ డివిజన్ దుర్గా కాలనీ, లక్ష్మీ గణపతి నగర్‌లో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న ప్రారంభమైన ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమం బుధవారం జరగ్గా, సంస్థ డైరెక్టర్ డాక్టర్ పరికి సుధాకర్ అభ్యర్థులకు స్వయంగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ పాషా, కుమారస్వామి, సరిత, శిరీష, శైలజ రెడ్డి, భాగ్య టీచర్, శ్రావ్య, శరణ్య, అనిత, సుమలత, లతా తదితరులు పాల్గొన్నారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలకు భవిష్యత్‌లో బ్యాంకు లింకుల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సంస్థ కట్టుబడి ఉందని నిర్వాహకులు తెలిపారు. అనేక వృత్తులలో నైపుణ్యం పొందిన మహిళలకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉందని మహిళలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహిళలు, వార్డు పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నార్ల వేణు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నార్ల వేణు ను నియమిస్తూ బుధవారం రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ ఎంజీఎం హాస్పిటల్ లో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ గా పని చేస్తున్న నార్ల వేణు గత 35సంవత్సరాలుగా ఫార్మసీ ఆఫీసర్స్ సమస్యల పరిష్కారానికి అవిశ్రాంతంగా కృషి చేశారని, అతడి సేవలను గుర్తించి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

# శాంతినికేతన్ స్కూల్ టాపర్ రసజ్ఞ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం మధ్యాహ్నం విడుదలైన ఎస్.ఎస్.సీ ఫలితాల్లో వరంగల్ నగరంలోని శాంతినికేతన్ పాఠశాల విద్యార్థిని దివ్వెల రసజ్ఞ 574 మార్కులు సాధించి స్కూల్ టాపర్ గా నిలిచింది. పాఠశాల నుంచి మొత్తం 25 మంది పరీక్షలకు హాజరు కాగా, 100 శాతం ఉత్తీర్ణులయ్యారని, 600 మార్కులకు గాను 574 మార్కులు సాధించి రసజ్ఞ స్కూల్ టాపర్ గా విజయ బావుటా ఎగురవేసిందని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీరాముల వెంకటేశ్వర్లు తెలిపారు. కాగా టాపర్ గా నిలిచిన రసజ్ఞను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

# భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- భూభారతి చట్టంపై అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారానికి శాశ్వతంగా మారేలా ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేర్కొన్నారు. నెక్కొండ, నర్సంపేట, నల్లబెల్లి మండల కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూభారతి-2025 నూతన ఆర్ఓఆర్ చట్టానికి సంబంధించిన మార్గదర్శకాలు, ప్రయోజనాలపై వీడియో ప్రసారం చేశారు. ప్రజల అభిప్రాయాలతో రూపొందించిన ఈ చట్టం ద్వారా రైతులకు ఎటువంటి ఖర్చు లేకుండా భూహక్కులు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రూపొందిన ఈ చట్టం రైతులకు, పేదలకు మేలు కలిగించడమే లక్ష్యంగా ఉందన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద ప్రస్తుతం రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో ఈ చట్టాన్ని అమలు చేస్తుండగా, త్వరలో జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించనున్నట్లు వివరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, భూమిపై భద్రత కల్పించేందుకు భూభారతి చట్టాన్ని రూపొందించామని తెలిపారు. భూ హక్కులు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కరెక్షన్, భూముల మార్కెట్ విలువ, భూ అప్పీల్ వ్యవస్థ, నిషేధిత భూముల వివరాలు వంటి అంశాలు భూభారతి పోర్టల్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. వారసత్వ భూముల మార్పిడి సందర్భంలో ప్రతి కుటుంబ సభ్యుడికి నోటీసులు జారీ చేసే విధానం ద్వారా భూ వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. గతంలో ధరణి చట్టంలో లేని ఈ ప్రయోజనాలు భూభారతిలో పొందుపరిచినట్లు వివరించారు. ప్రతి కమతానికి భూధార్ కార్డు జారీ చేయడం ద్వారా భూ హద్దుల క్లారిటీ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ప్రణాళికాధికారి గోవింద రాజన్, వ్యవసాయ శాఖాధికారి దామోదర్ రెడ్డి, ఆర్డీఓ ఉమారాణి, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ భూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు వాటిపై సమగ్రంగా సమాధానం ఇచ్చారు. భూభారతి చట్టాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని భూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన పుల్లూరి స్వప్న-సదానందం



**వరంగల్ వాయిస్, జమ్మికుంట :** మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన ఒగ్గు రమ-స్వర్గీయ మహేందర్ కూతురు సింధూజ-నరేష్ ల పెళ్లి వేడుకలు జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్ లో బుధవారం జరగాయి. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం హాజరై నూతన వధూవరులు సింధూజ-నరేష్ దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎగ్గెటి సదానందం, యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి చెన్నవేన రమేష్, కాంగ్రెస్ పార్టీ మడిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఉప్పుల సాంబశివరెడ్డి, నేరెళ్ల రఘుపతి, సీనియర్ నాయకులు అంబాల రాజు, ఐలోని సాంబశివరెడ్డి, ఒగ్గు కుమార్ స్వామి, మ్యాకమల్ల రత్నం, ఎగ్గెటి సుధాకర్, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో సత్తా చాటిన ఎర్రోజు అభినవ్ చంద్ర


## 600 గాను 582 మార్కులు



**వరంగల్ వాయిస్, సిద్దిపేట :** పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య (శ్రీచక్ర) పాఠశాలకు చెందిన ఎర్రోజు అభినవ్ చంద్ర సత్తా చాటాడు. 600 మార్కులకు 582 మార్కులు సాధించాడు. ఇక గణితంలో వందకు వంద మార్కులు సాధించడం విశేషం. మెరుగైన మార్కులతో జిల్లా స్థాయి ర్యాంకు సాధించడంపై అభినవ్ చంద్ర తల్లిదండ్రులు ఎర్రోజు శ్రీనివాస్- ఎర్రోజు రజిత దంపతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రిన్సిపల్ సునయన, ఇంచార్జి శ్రీకాంత్, తిరుపతి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో ఐఐటీలో ఇంజినీరింగ్ సీటు సాధించడమే తన లక్ష్యమని అభినవ్ చంద్ర పేర్కొన్నాడు.

# కేసీఆర్ కార్మికుల పక్షపాతి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** భారత రాష్ట్ర సమితి హనుమకొండ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ బుధవారం కార్మిక సంఘాల నాయకులతో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా బీఆర్ఎస్ పార్టీ కార్మికుల హక్కుల కోసం కట్టుబడి పనిచేస్తోందని, ప్రతి సంవత్సరం మే నెలను "కార్మిక మాసోత్సవంగా" నిర్వహిస్తూ కార్మికుల సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లిందని తెలిపారు. ఈ ఏడాది కూడా మే నెల మొత్తం కార్మిక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్మిక చట్టాలపై అవగాహన పెంపొందించడమే కాకుండా, కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో భవన నిర్మాణ కార్మికుల కోసం ప్రత్యేక బోర్డు ఏర్పాటు, బీమా సౌకర్యం, నైపుణ్య శిక్షణలు అమలు చేశామన్నారు. ప్రతి ఏడాది మే నెలలో కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య శిబిరాలు నిర్వహించడం సాంప్రదాయంగా కొనసాగుతున్నదన్నారు. మేడే రోజున రాష్ట్రవ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే మే నెలలో కార్మిక సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కేంద్రం ప్రవేశపెట్టిన నలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ప్రత్యేక సదస్సులు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కార్మిక సహకార సంఘాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామని, ఔట్సోర్సింగ్ మున్సిపల్ కార్మికులకు రూ.25,000 కనీస వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలిపింది. ఉపాధి హామీ పథకంలో పని దినాలను 150కి పెంచి రోజుకు రూ.350 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనం, అంగన్వాడీ, ఆశా వర్కర్ల వేతనాలు పెంచాలని, పెండింగ్ ప్రభుత్వ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ఆర్టీసీ కార్మికుల ప్రభుత్వ విలీనాన్ని కార్యరూపం దించి రెండు పీఆర్సీలను అమలు చేయాలని, బీడీ కార్మికుల పెన్షన్ కటాఫ్ తేదీ 2014 తొలగించాలని, ఆటో కార్మికులకు ఏటా రూ.12,000 ఆర్థిక సహాయం అందించాలని, భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, గిగ్ వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నేతలు నాయిని రవి, ఎంజాల మల్లేశం, కాటాపూర్ రాజు, రవీందర్ రెడ్డి, సంజీవ, తేలు సారంగపాణి, రఘుపతి రెడ్డి, సిద్ధిక్ పాల్గొన్నారు.




# భారీ బడ్జెట్ చిత్రాలతో లాభం లేదు

## గతానుభవాలతో అడుగేస్తున్న మోహన్ లాల్

భారీ బడ్జెట్ అండ్ ప్రయోగాత్మక చిత్రాలు చేసి దెబ్బతిన్నాడు మోహన్ లాల్. మాల్కోటై వాలిబన్, దర్శకత్వం వహించిన బర్రోజ్ సినిమాలు బాక్సాఫీస్ దగ్గర ఘోర పరాజయం పాలయ్యాయి. బర్రోజ్ ఒక్కటే వంద కోట్లకు పైగా నష్టాన్ని తెచ్చిపెట్టింది. రూ. 150 కోట్ల పెట్టి బొమ్మ తీస్తే రూ. 20 కోట్లను కూడా రాబట్టుకోలేకపోయింది. ఈ రెండు ఫ్లాపులతో కాస్తంత తడబడిన మాలీవుడ్ స్టార్ హీరోను మళ్లీ ట్రాక్ ఎక్కించింది లూసిఫర్ 2 ఎంపురన్.మార్చి 27న రిలీజైన ఎంపురన్ ఓవరాల్‌గా రూ. 260 కోట్లకు పైగా కలెక్ట్ చేసి మాలీవుడ్ చరిత్రలోనే హయ్యెస్ట్ గ్రాసర్ గా సరికొత్త రికార్డును సృష్టించింది. ఇప్పుడు లేటెస్ట్‌గా నెల రోజుల గ్యాప్‌లోనే వచ్చిన తుడరుమ్ కూడా హిట్ కొట్టేసింది. 15 ఏళ్ల తర్వాత లాలట్టన్‌తో జోడీ కట్టింది సీనియర్ బ్యూటీ– శోభన. దృశ్యం తరహాలోనే ఇది కూడా ఫ్యామిలీ అండ్ రివేంజ్ డ్రామాగా తీసుకువచ్చాడు డైరెక్టర్ తరుణ్ మూర్తి. ఏప్రిల్ 25న రిలీజైన తుడరుమ్ దూసుకెళుతోంది. ఇప్పుడు వంద కోట్ల క్లబ్‌లోకి జాయిన్ అవుతోంది. ఎంపురన్, తుడరుమ్ హిట్లతో మాల్కో–టై వాలిబన్, బర్రోజ్ లెక్కలు సరిచేసినట్లయ్యింది మోహన్ లాల్. ప్రయోగాల కంటే సింపుల్ ఫ్యామిలీ మ్యాన్ గెటప్‌లోనే కోట్లు కొల్లగొడుతున్నాడు. అందులోనూ తక్కువ బడ్జెట్ చిత్రాలే కాసుల వర్షం కురిపిస్తున్నాయి. లూసిఫర్ 2 సుమారు రూ. 150 కోట్లు ఖర్చుపెట్టగా తెచ్చింది రూ. 260 కోట్లే. కానీ తుడరుమ్ పై రూ.30 కోట్లలోపే బడ్జెట్ కేటాయించగా రూ. 100 క్లబ్‌లోకి చేరింది. ఈ లెక్కన చూస్తే తుడరుమ్ మెరుగైన లాభాల్ని చూసింది. ఇక తెలుగులో కూడా బ్రేక్ ఇవెన్ అయింది.

# జైలర్-2లో బాలయ్య

- **కోలీవుడ్‌లో తాజా చర్చ**

జనీకాంత్ జైలర్ సినిమాలో అనేకమంది స్టార్ నటులు తారసపడతారు. మోహన్ లాల్ వంటి దిగ్గజ నటులు ఇందులో కనిపిస్తారు. ఇప్పుడు జైలర్–2 తెరకెక్కుతోంది. ఈ సినిమాలో బాలకృష్ణ కూడా నటించబోతున్నారన్న వార్త బాలయ్య అభిమానుల్లో జోష్ నింపింది. రజనీకాంత్ , బాలకృష్ణ కలిసి తెరపై సందడి చేయబోతున్నారని కోలీవుడ్ వర్గాలు అంటున్నాయి. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'జైలర్2' మూవీ షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. ఇందులో ఓ కీలక పాత్ర కోసం నందమూరి బాలకృష్ణను చిత్ర బృందం సంప్రదించిందట. అందుకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు– తమిళ చిత్ర వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. రజనీ–నెల్సన్ కాంబినేషన్‌లో వచ్చిన యాక్షన్ కామెడీ ఫిల్మ్ 'జైలర్' బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. నెల్సన్ టేకింగ్, ఎలివేషన్స్‌కు తోడు రజనీకాంత్ స్టైలిష్ నటన సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చింది. ఆ మూవీ కొనసాగింపుగా 'జైలర్2' రూపొందుతోంది. తొలి భాగంలో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, జాకీష్రాఫ్ వంటి నటీనటులు సినిమాను మలుపుతిప్పే అతిథి పాత్రల్లో మెరిశారు. ఇప్పుడు అలాంటి పాత్రనే బాలకృష్ణ పోషించబోతున్నారని టాక్. జైలర్'లోనూ బాలకృష్ణను తీసుకుందామని తాను అనుకున్నట్లు నెల్సన్ ఓ సందర్భంలో చెప్పారు. అయితే, బాలకృష్ణకు ఉన్న ఇమేజ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆ పాత్రను తీర్చిదిద్దలేకపోవడంతో ముందుకు వెళ్లలేదని అన్నారు.





# ప్రాధాన్యం ఉన్న పాత్రల కోసం చూస్తున్న

కథలో తన ప్రాధాన్యత ఉంటేనే సినిమా చేస్తోంది మలయాళ కుట్టీ నివేదా థామస్. తెలుగులో చేసినవీ తక్కువ సినిమాలే అయినా గుర్తించిపోయే రోల్స్ చేసింది. నాని జెంటిల్ మెన్‌తో కెరీర్ స్టార్ట్ చేసిన నివేదా నిన్నుకోరి, జై లవకుశతో హ్యాట్రిక్ హిట్ అందుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్ అయ్యింది. గ్లామర్ పాత్రలకు నో చెబుతూ కథ నచ్చితేనే ప్రాజెక్ట్ యాక్సెప్ట్ చేస్తూ యునిక్ ఐడెంటిటీ–ని సొంతం చేసుకుంది. పవన్ కళ్యాణ్, జూనియర్ ఎన్టీఆర్, నాని లాంటి స్టార్లతో జోడీ కట్టింది నివేదా థామస్. కానీ శాకినీ డాకిని తర్వాత ఆచితూచి సినిమాలు చేస్తోంది. లాస్ట్ ఇయర్ 35 చిన్న కథ కాదు అంటూ ఓ సగటు మహిళ పాత్రలో మెస్మరైజ్ చేసేసిందీ బ్యూటీ. ఇద్దరు పిల్లలు తల్లిగా డీ గ్లామర్ పాత్రల్లో మెరిసింది. ఈ సినిమా వచ్చి దాదాపు 8 నెలలు కావొస్తున్నా కొత్త మూవీ ఎనౌన్స్ చేయలేదు. అయితే విజయ్ సేతుపతితో టాలీవుడ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ ఓ మూవీని ప్లాన్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోయిన్ క్యారెక్టర్ కోసంఈ కేరళ కుట్టీ–ని తీసుకున్నారని వార్తలు వచ్చాయి. కానీ అదేం లేదని పూరి టీ–ం క్లారిటీ– ఇచ్చింది. సో ప్రస్తుతం నివేదా చేతిలో సినిమాలేవీ లేవనే చెప్పాలి. ఒకప్పుడు స్టార్ హీరోలతో సినిమాలు చేసి ఇప్పుడు ఒక్క సినిమా కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. ఇదిలా ఉం–టె–35 సినిమా కోసం బరువు పెరిగిన నివేదా ప్రస్తుతం బరువు తగ్గే పనిలో ఉంది అందుకే సినిమాలు చేయట్లేదు అనే టాక్ కూడా వినిపిస్తోంది.





# నాని హిట్ మూవీకి టిక్కెట్ల రేట్లు పెంపు

నేచురల్ స్టార్ నాని నటించిన హిట్–3 మే 1 న గురువారం రిలీజ్ కాబోతోంది. శైలేష్ కొలను డైరెక్షన్ లో వస్తున్న మూడో సినిమా. ఇప్పటికే వచ్చిన రెండు పార్టులు మంచి హిట్ అయ్యాయి. అందుకే మూడో పార్టు మీద అంచనాలు పెరుగుతున్నాయి. పైగా ఎన్నడూ లేనంతగా ఇందులో వైలెంటిక్ పాత్రలో నటిస్తున్నాడు నాని. ఇప్పటికే వచ్చిన టీజర్, ట్రైలర్ అంచనాలను పెంచేశాయి. దీంతో మూవీ కోసం ఫ్యాన్స్ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ టికెట్ల రేట్లు పెంచిన తర్వాతనే అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయాలని మూవీ టీమ్ ప్లాన్ చేస్తోంది. తాజాగా ఏపీ ప్రభుత్వం మూవీ టీమ్ కు గుడ్ న్యూస్ చెప్పింది. టికెట్ల రేట్లను పెంచుతూ జీవో విడుదల చేసింది. సింగిల్ స్క్రీన్లలో రూ.50, మల్టీప్లెక్స్ లలో రూ.75 వరకు పెంచుకునేందుకు పర్మిషన్ ఇచ్చింది. జీఎస్టీతో కలిపి ఈ ధరలను పెంచింది. మూవీ విడుదలైన తేదీ నుంచి వారం వరకు ఈ ధరలు ఉంటాయి. ఆ తర్వాత మామూలు ధరలకే టికెట్లు– అందుబాటు–లో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. వాస్తవానికి జీవో నిన్ననే వస్తుందని అంతా అనుకున్నారు. కానీ అనుకోని కారణాలతో ఆలస్యం అయింది. ఇప్పుడు జీవో రావడంతో మూవీ అడ్వాన్స్ బుక్ మై షోలో ఓపెన్ అయ్యాయి. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో దీన్ని తెరకెక్కించారు. ఇటు తెలంగాణలో మాత్రం టికెట్ల రేట్లు పెంచట్లేదు.

# పుష్కరాల పనులు పూర్తి చేయండి

- **ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
- **అధికారులకు ఆదేశం**



**వరంగల్ వాయిస్, మహాదేవపూర్ :** దగ్గరపడుతున్న సరస్వతీ పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు సమయానుకూలంగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాళేశ్వరంలో వీవీఐపీ ఘాట్, గోదావరి ఘాట్, 100 గదుల సత్రం, వైద్యశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గోదావరిలో వ్యర్థాలు తొలగించి పరిశుభ్రం చేయాలని సూచించారు. సమయం చాలా తక్కువగా ఉందని, ఆశించిన స్థాయిలో ఇప్పటి వరకు పనులు జరగలేదంటూ అధికారులకు చురకలంటించారు. పెండింగ్ పనులను అధికారులు గుర్తించి నిర్దిష్ట కార్యాచరణతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, అవసరమైన సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పుష్కరాలకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉన్నందున, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు. పనులు వేగవంతం చేసేందుకు కూలీలను పెంచాలన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, పంచాయతి రాజ్, ఇరిగేషన్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య, దేవాదాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయ సంఘాలు
## పాలకుల పక్షం కారాదు

**వరంగల్ వాయిస్, సుబేదారి :** రాష్ట్రంలో జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ పెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్టు అంతడుపుల శ్రీనివాస్ అన్నారు. గురువారం హనుమకొండలోని టీజీవో భవన్ లో జరిగిన టీడబ్యజేఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల సభ్యత్వ నమోదు కార్యక్రమం, వివిధ యూనియన్ ల నాయకుల చేరికల కార్యక్రమంలో ఫెడరేషన్ అధ్యక్షులు మామిడి సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, రాజశేఖర్, వరంగల్, హన్మకొండ జిల్లాల ఇంచార్జి చంద్రశేఖర్, రాష్ట్ర కార్యదర్శి బొక్కా దయాసాగర్ మాట్లాడారు. యూనియన్ కు చెందిన వంద మంది నాయకులు, జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. జిల్లా అధ్యక్షుడు టీవీ.రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అశోక్ ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వల్లాల జగన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కుల విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు కుడుతాడి బాపురావు, హనుమకొండ జిల్లా కార్యదర్శి గోపాల్, వరంగల్ జిల్లా కార్యదర్శి స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన నిలుస్తాం..
# మెరుగైన పాలన అందిస్తాం..



- **ఎమ్మెల్యే కడియం శ్రీహరి**
- **రూ.1.19కోట్లతో పూర్తి చేసిన సీసీ రోడ్డుకు ప్రారంభోత్సవం**

**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** నియోజకవర్గంలోని ప్రతీ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చారు. చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో రూ.1.19కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి విగ్రహ ప్రతిష్ట, ధ్వజ స్థంభ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ.. పల్లగుట్ట గ్రామానికి ఎంత చేసినా తక్కువేనన్నారు. నాకు ఎల్లప్పుడూ అండగా పల్లగుట్ట ప్రజలు నిలుస్తున్నారని గుర్తు చేశారు. పల్లగుట్ట గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదే అని హామీ ఇచ్చారు. అతి త్వరలో మరో కోటి రూపాయలతో సీసీ రహదారులను మంజూరు చేయిస్తానన్నారు. పల్లగుట్ట గ్రామానికి 50 ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇచ్చానని త్వరలోనే మరో 50 మంజూరు చేస్తానన్నారు. ఇది చాలా పెద్ద గ్రామం అయినందున అందుకు అనుగుణంగా నిధుల కేటాయింపు కూడా పెద్దగానే ఉంటుందని ప్రకించారు. అందుకు పల్లగుట్ట గ్రామ ప్రజల సహకారం కావాలని తెలిపారు. గత ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేశారో మీ అందరికీ తెలుసన్నారు. నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన ఒక్క ఏడాదిలోనే నియోజకవర్గ అభివృద్ధికి రూ.800 కోట్ల నిధులు తీసుకొచ్చానని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చే విధంగా ప్రయత్నం చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలు గర్వపడే విధంగానే నా పని తీరు ఉంటుందన్నారు. తాను ఏనాడూ అవినీతికి పాల్పడలేదన్నారు, పనులు, పదవులు, పథకాలు అమ్ముకోలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16నెలలలోనే అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలులోకి తెచ్చామన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి పండుగ సందర్భంగా ఆ తల్లీ దీవెనలు పల్లగుట్ట ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిల్పూర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ రావు, స్టేషన్ ఘనపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన జంటను ఆశీర్వదించిన జర్నలిస్టులు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఆంధ్రజ్యోతి పాత్రికేయులు వడిచర్ల విజయ లక్ష్మి-శ్రీనివాస్ దంపతుల కనిష్ట పుత్రుడు రాకేష్ దత్త వివాహం వైష్ణవితో బుధవారం వరంగల్ పట్టణంలోని సునిల్ గార్డెన్ లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకలకు షాప్ పూర్వ డైరెక్టర్, వరంగల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు వల్లాల వెంకట రమణ, సీనియర్ జర్నలిస్టులు ప్రవీణ్, వేముల సదానందం, రాచర్ల ఓంకార్ తదితరులు హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించారు.




## జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇవ్వాలి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ అధ్యక్షతన బుధవారం బాలసముద్రంలోని ఏకశిలా పార్క్ ఎదుట వరంగల్ పరిధిలోని జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూంలు కేటాయించాలని కోరుతూ మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ముందుండి పోరాడిన జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా మిత్రులు, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ శాసనసభ్యులు మార్తీనేని ధర్మారావు, మాజీ పార్లమెంట్ సభ్యులు అజ్మీర సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు వన్నాల శ్రీరాములు, ఆరూరి రమేష్, మాజీ పూర్వ జిల్లా అధ్యక్షులు చాడ శ్రీనివాసరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, గురుమూర్తి శివకుమార్, రత్నం సతీష్ షా, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శిలు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, డాక్టర్ గోగుల రాణా ప్రతాపరెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, కార్పొరేటర్ చాడ స్వాతి, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, వివిధ మోర్చా నాయకులు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com